# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 102
పేజీలు : 04 | వెల: రూ.5/-
శుక్రవారం
ఏప్రిల్ 10, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు
- చిన్నారులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ

## మహిళల సంక్షేమానికి 'ప్రజా ప్రభుత్వం' పెద్దపీట



# కాళేశ్వరంపై ఇప్పుడా కళ్లు తెరిచేది?

- కల్వకుంట్ల కవిత
- రెండేళ్లు పంటలు ఎండబెట్టి..
- ఇప్పుడు మరమ్మతులంటే కమిషన్ల కోసమేనా?
- ఫ్యూచర్ సిటీ జపం.. రియల్ ఎస్టేట్ లాభాల కోసమే!
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల్లో 'గుంపు మేస్త్రీ' అవినీతి పాలన
- సీఎం రేవంత్ రెడ్డిపై జాగృతి అధ్యక్షురాలు నిప్పులు

2లో..

కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలన్న ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రాజెక్టును రెండేళ్ల పాటు ఎందుకు నానబెట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి రైతుల పంటలు ఎండబెట్టిందని కవిత ఆరోపించారు. "కాళేశ్వరంపై ప్రభుత్వం ఇప్పుడే నిర్ణయం తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటి? గతంలోనే మరమ్మతులు చేసి ఉంటే రైతులకు ఎంతో మేలు జరిగేది కదా! ఇప్పుడు హడావిడిగా పనులు చేపట్టడం వెనుక కమిషన్ల ఆశ ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయి" అని వ్యాఖ్యానించారు.

వరంగల్ వాయిస్, ప్రత్యేక ప్రతినిధి :

## మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



2లో..

- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో నడిపిస్తా
- సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



2లో..

## పున్నేలు ట్రిపుల్ మర్డర్ కేసు గుట్టురట్టు

- భార్య, ఇద్దరు కూతుళ్లను చంపిన భర్త
- ఆడపిల్లలు పుడుతున్నారని వేధింపులు
- మరో పెళ్లి కోసమే ఈ దారుణం
- లింగ నిర్ధారణ చేసిన డాక్టర్లు సహా 10 మంది అరెస్ట్
- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

## యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- వడ్డేపల్లి పార్క్‌లో ఘనంగా ఆయుష్ దినోత్సవం
- యోగాసనాలు వేసి ఉత్సాహపరిచిన కలెక్టర్



4లో..



3లో..

- యువతిపై సామూహిక అత్యాచారం, హత్య?
- ఏకే తండాలో కలకలం..
- రావూరు తండా యువకులపై ఆరోపణలు
- పోలీసుల తీరుపై మృతురాలి బంధువుల ఆగ్రహం
- జాతీయ రహదారిపై ధర్నా

## రాయపర్తి మండలంలో దారుణం

## యోగతోనే ఆత్మీయ సమతుల్యత



4లో..

- జిల్లా కలెక్టర్ డా.సత్య శారద
- ఖిలా వరంగల్‌లో ప్రపంచ హోమియోపతి, ఆయుష్ దినోత్సవ వేడుకలు
- స్వయంభూ దేవాలయం వద్ద కలెక్టర్ యోగాసనాలు

# ఆత్మకూరు ఎస్సై సతీష్ సస్పెన్షన్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** వరంగల్ జిల్లా ఆత్మకూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) సతీష్‌పై వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొంతకాలంగా ఎస్సై సతీష్ తీరుపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా పలు కేసుల దర్యాప్తులో అవినీతికి పాల్పడుతున్నారని, విధు పట్ల తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో సీపీ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు రహస్యంగా అంతర్గత విచారణ చేపట్టారు. విచారణలో ఎస్సైపై వచ్చిన అవినీతి ఆరోపణలు నిజమని ప్రాథమికంగా తేలింది. అంతేకాకుండా, పలు కీలక కేసుల నమోదు మరియు దర్యాప్తులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు అధికారులు నిర్ధారించారు. శాఖాపరమైన క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు గాను, ఆయనను విధుల్లో నుంచి తొలగిస్తూ కమిషనర్ కఠిన నిర్ణయం తీసుకున్నారు.

# మహిళల సంక్షేమానికి 'ప్రజా ప్రభుత్వం' పెద్దపీట

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్వాడీ టీచర్ల పాత్ర వెలకట్టలేనిదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొనియాడారు. శుక్రవారం హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ లతో కలిసి 117 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళలు, చిన్నారుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.54 కోట్ల వ్యయంతో సుమారు 38,000 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడం ద్వారా పోషకాహార పంపిణీ, గర్భిణీల ఆరోగ్య వివరాల నమోదు వంటి సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని ఆయన సూచించారు. కేవలం స్మార్ట్ ఫోన్లు మాత్రమే కాకుండా, అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఉచితంగా యూనిఫామ్స్ (దుస్తులు) పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి, సంబంధిత శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళతామని భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాల బలోపేతం వంటి పథకాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, పోతుల శ్రీమాన్, మానసతో పాటు ఐసీడీఎస్ ఆర్.జె.డి, సీడీపీఓలు, సూపర్వైజర్లు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో నడిపిస్తా
- సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నారం గ్రామంలో శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.15 లక్షల సీఆర్ఆర్ నిధులతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. నిర్ణీత కాలవ్యవధిలోగా నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, వివిధ విభాగాల డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై ఇప్పుడా కళ్లు తెరిచేది ?

- కల్వకుంట్ల కవిత
- రెండేళ్లు పంటలు ఎండబెట్టి..
- ఇప్పుడు మరమ్మతులంటే కమిషన్ల కోసమేనా?
- ఫ్యూచర్ సిటీ జపం.. రియల్ ఎస్టేట్ లాభాల కోసమే!
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల్లో 'గుంపు మేస్త్రీ' అవినీతి పాలన
- సీఎం రేవంత్ రెడ్డిపై జాగృతి అధ్యక్షురాలు నిప్పులు

కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలన్న ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రాజెక్టును రెండేళ్ల పాటు ఎందుకు నానబెట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి రైతుల పంటలు ఎండబెట్టిందని కవిత ఆరోపించారు. "కాళేశ్వరంపై ప్రభుత్వం ఇప్పుడే నిర్ణయం తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటి? గతంలోనే మరమ్మతులు చేసి ఉంటే రైతులకు ఎంతో మేలు జరిగేది కదా! ఇప్పుడు హడావిడిగా పనులు చేపట్టడం వెనుక కమిషన్ల ఆశ ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయి" అని వ్యాఖ్యానించారు.

### హెచ్ఎండీఏలో నామినేషన్ల దందా!

మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీ శాఖల్లో అవినీతి రాజ్యమేలుతోందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్ఎండీఏ చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఉండి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో రూ.480 కోట్ల పనులు నామినేషన్ మీద ఇస్తే, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రూ.1,140 కోట్ల పనులను అదే పద్ధతిలో కట్టబెట్టారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు పూర్తి విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో రూ.35 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని, ఆ నిధులను హైదరాబాద్ అభివృద్ధికి ఖర్చు చేయడం లేదని ఆరోపించారు.

### ఫ్యూచర్ సిటీ.. అంతా రియల్ ఎస్టేట్ కోసమే!

ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న 'ఫ్యూచర్ సిటీ' కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమేనని కవిత విమర్శించారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే వ్యక్తులు చెప్పినట్లే పనులు జరుగుతున్నాయని, జీహెచ్ఎంసీలో 'గుంపు మేస్త్రీ' పాలనలో మహా అవినీతి జరుగుతోందని ఎద్దేవా చేశారు. ఓఆర్ఆర్ టెండర్లపై గతంలో ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక అవే కాంట్రాక్టులను ఎలా కొనసాగిస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మహిళా బిల్లు అమలు కాకపోవడం వల్ల 12 రాష్ట్రాల ఎన్నికల్లో మహిళా ప్రతినిధులు నష్టపోయారని, 2027 జనగణన తర్వాతే రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.



### పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఈ నెల 25న పార్టీ ఆవిర్భావ వేడుకల కోసం 21 కమిటీలు వేశామని, 500 మంది వాలంటీర్లు సేవలందిస్తారని తెలిపారు. ఎంపీ ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని, తెలంగాణ ప్రజల పక్షాన తాను పోరాడుతున్నానని.. ఎవరో చెబితే పార్టీ పెట్టే స్థాయిలో తాను లేనని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇతర రాష్ట్రాలకు తెలియజేసేందుకు కేరళ ప్రజల కోసం ఒక ప్రత్యేక వీడియోను కూడా విడుదల చేసినట్లు ఆమె వెల్లడించారు.

# పనిచేసి నెలలు గడుస్తున్నా పైసలియ్యరా ?

**వరంగల్ వాయిస్, దామెర :** "మండుటెండలో బుక్కెడు నీళ్లు తాగుతూ చెరువుల్లో పనిచేసినం.. నెలలు గడుస్తున్నా కూలీ పైసలు రాకపోతే మేమెట్లా బ్రతకాలి?" అంటూ ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం దామెర మండలం ల్యాదేళ్ల గ్రామంలో చెరువు పూడికతీత పనులు చేస్తున్న కూలీలతో కలిసి దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో 'సామాజిక పరివర్తన ప్రచారోద్యమం' నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ.. మండలంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ల్యాదేళ్ల గ్రామంలో 58 జాబ్ కార్డులను తొలగించి 146 మందిని పనికి దూరం చేశారని, మండల వ్యాప్తంగా 1,571 కార్డులను రద్దు చేసి 3,134 మంది కూలీలపై వివక్ష చూపారని ఆరోపించారు.అనంతరం మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు డిబిఎఫ్ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.




# పున్నేలు త్రిపుల్ మర్డర్ కేసు గుట్టురట్టు


- భార్య, ఇద్దరు కూతుళ్లను చంపిన కిరాతక భర్త
- ఆడపిల్లలు పుడుతున్నారని వేధింపులు
- మరో పెళ్లి కోసమే ఈ దారుణం
- లింగ నిర్ధారణ చేసిన డాక్టర్లు సహా 10 మంది అరెస్ట్
- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైమ్ :** రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఐనవోలు మండలం పున్నేలు గ్రామానికి చెందిన భార్య, ఇద్దరు కుమార్తెల హత్య కేసును వరంగల్ పోలీసులు ఛేదించారు. భార్య పిల్లలు ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి చనిపోయారని నమ్మించే ప్రయత్నం చేసిన భర్త ఎండీ అజారుద్దీన్ (29) అసలు హంతకుడని పోలీసులు తేల్చారు. ఈ కేసులో అజారుద్దీన్‌తో పాటు అతనికి సహకరించిన కుటుంబ సభ్యులు, నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన ఆర్ఎంపీలు, ల్యాబ్ టెక్నీషియన్లు, డాక్టర్లు సహా మొత్తం 10 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నిందితుడు అజారుద్దీన్ 2016లో ఫరహాత్‌ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి హుమేరా (9), ఆయేషా (6) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, కుమారుడు కావాలనే కోరికతో ఉన్న అజారుద్దీన్ కుటుంబ సభ్యులు, 2021, 2022లో ఫరహాత్ గర్భం దాల్చినప్పుడు నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించారు. పుట్టబోయేది ఆడపిల్ల అని తెలియడంతో డాక్టర్ల సహకారంతో ఆమెకు ఇష్టం లేకపోయినా రెండుసార్లు అబార్షన్ చేయించారు. అజారుద్దీన్ తన దూరపు బంధువైన ఓ మైనర్ బాలికపై కన్నేశాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని ఒత్తిడి చేయగా.. "నీకు అప్పటికే భార్య, పిల్లలు ఉన్నారు, నిన్ను పెళ్లి చేసుకోను" అని ఆమె నిరాకరించింది. దీంతో భార్య, పిల్లలు అడ్డు తొలగించుకుంటేనే తన రెండో పెళ్లి సాధ్యమవుతుందని అజారుద్దీన్ భావించాడు. ఈ క్రమంలోనే భార్య మళ్ళీ గర్భం దాల్చడం, ఈసారి కూడా ఆడపిల్లే పుడుతుందనే అనుమానంతో వారిని అంతమొందించాలని పథకం వేశాడు. ఈ నెల 1న రాత్రి ఐస్ క్రీం తినిపిస్తానని నమ్మించి భార్య పిల్లలను తాను నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ వద్దకు కారులో తీసుకెళ్లాడు. అక్కడ ముందుగానే సీసీ కెమెరాలు, విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. అనంతరం ముగ్గురినీ బలవంతంగా స్విమ్మింగ్ పూల్‌లోకి తోసేసి, వారు ప్రాణాలు విడిచే వరకు నీటిలో ముంచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం వారు ప్రమాదవశాత్తు పడి చనిపోయారని నాటకమాడాడు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు టెక్నాలజీ సాయంతో అజారుద్దీన్ నేరాన్ని నిరూపించారు. ఈ క్రమంలో అక్రమంగా లింగ నిర్ధారణ చేసిన నెక్కొండకు చెందిన డాక్టర్ పార్థు, నర్సు స్రవంతి, ల్యాబ్ టెక్నీషియన్ మనోహర్, ఆర్ఎంపీ నరేష్ తదితరులను అరెస్ట్ చేశారు. కాగా, పరారీలో ఉన్న డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ రవళి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ సంక్లిష్టమైన కేసును ఛేదించిన ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామనూర ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, గీసుగొండ ఇన్ స్పెక్టర్ విశ్వేశ్వర్, ఇతర సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# పర్వతగిరిలో నకిలీ పత్రాల కలకలం

**▪ పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ**

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చెరువుకొమ్ము తండా (సీకే తండా)లో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి, నకిలీ ఆస్తి యాజమాన్య ధృవీకరణ పత్రాన్ని సృష్టించిన ఘటన స్థానికంగా సంచలనం రేపుతోంది. ఒక వ్యక్తి వ్యక్తిగత లాభం కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని, అధికారిక రబ్బరు ముద్రలను నకిలీగా తయారు చేశాడు. ఆ నకిలీ పత్రంతో ఆస్తి యాజమాన్య సర్టిఫికెట్‌ను సృష్టించి, ఒక ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో రుణం పొందేందుకు ప్రయత్నించాడు. కాగా, సదరు సర్టిఫికెట్ పై అనుమానం వచ్చిన ఫైనాన్స్ ప్రతినిధులు ఈ నెల 9న సీకే తండా పంచాయతీ కార్యదర్శి మాలతిని సంప్రదించడంతో అసలు విషయం బయటపడింది. ఫైనాన్స్ ప్రతినిధులు చూపిన పత్రాన్ని పరిశీలించిన కార్యదర్శి మాలతి.. అది తాను జారీ చేసింది కాదని స్పష్టం చేశారు. సాధారణంగా పంచాయతీ కార్యాలయంలో వాడే రబ్బరు ముద్రలు ఇంగ్లీషులో ఉంటాయని, కానీ సదరు నకిలీ పత్రంపై తెలుగులో ముద్రలు ఉండటాన్ని ఆమె గుర్తించారు. సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసినట్లు ఆమె నిర్ధారించారు. ఈ మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.



**మధ్యవర్తులను నమ్మవద్దు**

గ్రామ పంచాయతీ సేవల కోసం మధ్యవర్తులను నమ్మవద్దని ఎంపీఓ హెచ్చరించారు. అవసరమైన సర్టిఫికెట్లు పంచాయతీ కార్యాలయంలోనే నేరుగా పొందవచ్చని తెలిపారు. నకిలీ సర్టిఫికెట్లు తీసుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని, ఇప్పటికే కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ప్రజలు కార్యదర్శులు, సర్పంచ్‌లను సంప్రదించాలని సూచించారు.

# రాయపర్తి మండలంలో దారుణం

**◆ యువతిపై సామూహిక అత్యాచారం, హత్య?**
**◆ ఏకే తండాలో కలకలం..**
**◆ రావూరు తండా యువకులపై ఆరోపణలు**

**వరంగల్ వాయిస్, రాయపర్తి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండల పరిధిలోని ఏకే తండాలో దారుణ ఘటన వెలుగుచూసింది. 21 ఏళ్ల ఓ యువతిపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడి, అనంతరం ఉరివేసి హత్య చేశారన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి రావూరు తండాకు చెందిన నలుగురు యువకులపై మృతురాలి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నిన్న రాత్రి రావూరు తండాకు చెందిన నలుగురు యువకులు యువతిపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. తీవ్ర రక్తస్రావం కావడంతో యువతి మృతి చెందిందని, అయితే దీనిని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు నిందితులు ఆమెను ఉరివేసి చంపారని బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట మార్చురీకి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని, నిందితులను అరెస్ట్ చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మృతురాలి బంధువులు, తండా వాసులు వర్ధన్నపేట మార్చురీ ముందున్న జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి తమకు న్యాయం చేసే వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనివ్వబోమని వారు భీష్మించుక కూర్చున్నారు. దీనితో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. నిందితులుగా భావిస్తున్న యువకులు నిత్యం గంజాయి మత్తులో ఉండేవారని, ఆ మత్తులోనే ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టారని యువతి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి సాగు, విక్రయాలు పెరిగిపోవడం వల్లనే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయని వారు మండిపడుతున్నారు. పోలీసులు స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు రంగంలోకి దిగి ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు.

# యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, పరకాల :** సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసమే ప్రాకులాడకుండా, నూతన నైపుణ్యాలను పెంపొందించుకుని ఇతరులకు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. టెక్నాలజీలో వస్తున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమను తాము మలచుకోవాలన్నారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ (స్వయం ఉపాధి) లక్ష్యంగా పెట్టుకుని, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, స్థానిక కౌన్సిలర్ గొడుగు రజిత నాగరాజు, నాయకుడు బండి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు


**• నిర్వాహకుడితో సహా 12 మంది అరెస్ట్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఐపీఎల్ సీజన్‌ను అడ్డం పెట్టుకుని ఆన్లైన్ వేదికగా సాగుతున్న భారీ క్రికెట్ బెట్టింగ్ రాకెట్‌ను వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఛేదించారు. కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ దందాను గుర్తించి, నిర్వాహకుడు గట్ల రాజేష్‌తో పాటు మరో 11 మంది పందెం రాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఏ.మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు Cric666. live అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా వరంగల్, హన్మకొండ, జనగామ ప్రాంతాలకు చెందిన ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ ఉద్యోగులు, దినసరి కూలీలను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా వల విసురుతోంది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశ చూపి సామాన్యులను జూదం వైపు మళ్ళిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన టాస్క్ ఫోర్స్ బృందం, నిందితుల నుంచి రూ.1,06,000 నగదుతో పాటు బెట్టింగ్



కోసం ఉపయోగిస్తున్న 12 స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకుంది. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి విచారణ నిమిత్తం కేయూసీ పోలీసులకు అప్పగించారు. క్రికెట్ బెట్టింగ్ అనేది చట్టరీత్యా నేరమని, ఇలాంటి ఆన్లైన్ జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ హెచ్చరించారు. ముఖ్యంగా యువత, కార్మికులు ఇటువంటి వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. బెట్టింగ్ నిర్వహించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.

# నగదు బహుమతి గెలుచుకున్న సాగంటి చిత్రం..




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతుల సందర్భంగా జాషువా సాంస్కృతిక వేదిక మరియు ఎంబీవీకే ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్ సంయుక్తంగా నిర్వహించిన చిత్రకళా పోటీల్లో హనుమకొండకు చెందిన ప్రముఖ చిత్రకారిణికి గౌరవం దక్కింది. 'కులరహితం – సమాజ హితం' వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ అధినేత డాక్టర్ మంజుల సాగంటి రూపొందించిన చిత్రపటం ప్రోత్సాహక నగదు బహుమతిని గెలుచుకుంది. 'కుల రహిత సమాజం' అనే ఇతివృత్తంతో ఆమె గీసిన ఈ చిత్రం రాష్ట్ర స్థాయిలోని ఉత్తమ చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ఈ నెల 11వ తేదీన (శనివారం) విజయవాడలో నిర్వహించనున్న ప్రత్యేక ప్రదర్శనలో ఈ చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. అదే వేదికపై జరగనున్న అవార్డుల ప్రదానోత్సవంలో మంజుల సాగంటి నగదు బహుమతిని అందుకోనున్నారు. ఈ గుర్తింపుపై డాక్టర్ మంజుల సాగంటి సంతోషం వ్యక్తం చేశారు. సమాజంలోని అసమానతలను రూపుమాపేలా చిత్రకళ ద్వారా అవగాహన కల్పించడం తన బాధ్యతగా భావిస్తున్నానని, ఈ పురస్కారం భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలు గీసేందుకు తనకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చిందని ఆమె పేర్కొన్నారు.

# తై బజార్‌లో కాంట్రాక్టర్ 'దందా'

**నిబంధనలకు నీళ్లొదిలి అధిక వసూళ్లు!**



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం గ్రామంలో నిర్వహిస్తున్న తై బజార్‌లో కాంట్రాక్టర్ అక్రమ వసూళ్లకు తెరలేపారు. గ్రామ పంచాయతీ నిర్ణయించిన ధరలను బేఖాతరు చేస్తూ, తన ఇష్టారాజ్యంగా రేట్లు వసూలు చేస్తూ భక్తులు, సామాన్య ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం.. తై బజార్‌లో కోడి హలాల్‌కు రూ.40, యాట (మేక/గొర్రె) హలాల్‌కు రూ.150 చొప్పున చిట్టి రేట్లు నిర్ణయించారు. అయితే, వీటిని కాంట్రాక్టర్ ఏమాత్రం పట్టించుకోకుండా, కోడికి రూ.50, యాటకు రూ.200 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ, ప్రజలపై భారం మోపుతున్న కాంట్రాక్టర్ అక్రమాలను అరికట్టడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. కళ్ల ముందే అక్రమ వసూళ్లు జరుగుతున్నా పాలకమండలి ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడం లేదని వారు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# స్కూల్ రీ ఓపెన్ చేయాలని వినతి



**వరంగల్ వాయిస్ మల్హర్:** గత పది సంవత్సరాల క్రితం మూత పడిన మండలంలోని అడ్వాల పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ని రీ ఓపెన్ చేయాలని జిల్లా విద్యా శాఖ కో ఆర్డినేటర్ రాజగోపాల్ కు బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు అజ్మీరా బాలాజీ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ప్రైమరీ స్కూల్ లేకపోవడం వల్ల గ్రామానికి చెందిన 30 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు వెళ్లాల్సి రావడంతో వారికి ఫీజుల చెల్లింపు భారంగా మారుతుంది కావున అధికారులు స్పందించి పాఠశాల ను రీ ఓపెన్ చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# కి'లేడీ' అరెస్ట్

- స్నేహితురాలి ఇంట్లోనే చోరీ
- 6 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం




**వరంగల్ వాయిస్, సుబేదారి :** నమ్మిన స్నేహితురాలి ఇంట్లోనే దొంగతనానికి పాల్పడిన ఓ మహిళను సుబేదారి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితురాలి నుంచి సుమారు 6 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకుని, ఆమెను రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ బాలసముద్రం శ్రీనివాస్ నగర్‌కు చెందిన పెరుగు సుమశ్రీ (33) అనే గృహిణి, అక్టోబర్ 2024లో తన స్నేహితురాలు మియాపురం శ్రీలత ఇంటికి వెళ్ళింది. శ్రీలత ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన విషయాన్ని గమనించిన సుమశ్రీ, దొంగతనానికి పథకం వేసింది. ఇంట్లోకి చొరబడి హాల్లో ఉన్న బీరువా తాళాన్ని డంబెల్ సహాయంతో పగులగొట్టి, లోపల ఉన్న నగదు, బంగారాన్ని దోచుకెళ్లింది. నక్కలగుట్ట జంక్షన్ వద్ద సుబేదారి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్ కుమార్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, సుమశ్రీ చేతిలో బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులను చూసి కంగారు పడుతున్న ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది. స్నేహితురాలి ఇంట్లో తానే చోరీ చేశానని ఆమె నేరాన్ని ఒప్పుకుంది. నిందితురాలి నుంచి 6 తులాల బంగారు నెక్లెస్, జత చెవి కమ్మలు, బంగారు బిళ్ళ, ఉంగరం, గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగిన అనతి కాలంలోనే కేసును ఛేదించి నిందితురాలిని పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్, ఎస్సైలు కృష్ణవేణి, సోనీ, మహేందర్ రెడ్డిలను సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, హనుమకొండ ఏసీపీ పి. నర్సింహారావు ప్రత్యేకంగా అభినందించారు.

# యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- వడ్డేపల్లి పార్క్‌లో ఘనంగా ఆయుష్ దినోత్సవం
- యోగాసనాలు వేసి ఉత్సాహపరిచిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిత్యం యోగా సాధన చేయడం ద్వారానే శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పరిపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం వడ్డేపల్లి పార్క్‌లో వైద్య ఆరోగ్య, ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత యోగా శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా యోగాసనాలు వేసి అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ.. యోగా మన భారతీయ సంస్కృతి అందించిన గొప్ప వరమని, నేడు ప్రపంచవ్యాప్తంగా దీనికి ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. లండన్ వంటి నగరాల్లోనూ పాఠశాల విద్యార్థులకు వారానికి ఒకసారి యోగా తరగతులు నిర్వహించడం దాని ప్రాముఖ్యతకు నిదర్శనమన్నారు. హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానీమన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత హోమియో, ఆయుర్వేద మెగా హెల్త్ క్యాంప్‌ను కార్పొరేటర్ దాస్యం అభినయ భాస్కర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 453 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఆయుష్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ ఎస్.మహేంద్ర కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

### భద్రకాళి పూడికతీత పనులు వేగవంతం చేయండి ..

హనుమకొండ నగర నడిబొడ్డున ఉన్న చారిత్రాత్మక భద్రకాళి చెరువు పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె చెరువులో కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కాజీపేట మండలం అమ్మవారిపేటలోని ప్రభుత్వ స్థలాల్లో నిల్వ చేస్తున్న పూడిక మట్టి తరలింపు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భద్రకాళి చెరువులో మొత్తం 7.70 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 2 లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తయిందని తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే, అంటే వచ్చే మే 15 నాటికి మిగిలిన పనులను పూర్తి చేసేలా పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. మట్టి నిల్వ కేంద్రాల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. ఈ పర్యటనలో సాగునీటి పారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, డీఈ మధుసూదన్ రెడ్డి, కుడా సీపీఓ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యోగతోనే ఆత్మీయ సమతుల్యత

- జిల్లా కలెక్టర్ డా.సత్య శారద
- ఖిలా వరంగల్‌లో ప్రపంచ హోమియోపతి, ఆయుష్ దినోత్సవ వేడుకలు
- స్వయంభూ దేవాలయం వద్ద కలెక్టర్ యోగాసనాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** శరీరం, మనసు, ఆత్మను సమతుల్యం చేసేందుకు యోగమే ఏకైక మార్గమని వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అన్నారు. 'ప్రజాపాలన–ప్రగతి' 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆరోగ్య థీమ్ – 5వ రోజు సందర్భంగా శుక్రవారం ఖిలా వరంగల్‌లో ప్రపంచ హోమియోపతి, ఆయుష్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఖిలా వరంగల్ స్వయంభూ దేవాలయం వద్ద నిర్వహించిన యోగ ప్రదర్శనలో కలెక్టర్ స్వయంగా పాల్గొని ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి ఉరుకుల పరుగుల జీవనంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారని, నిత్యం యోగ సాధన చేయడం ద్వారా జీవనశైలి వ్యాధులను నివారించుకోవచ్చని తెలిపారు. ప్రతి పౌరుడు యోగను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. హోమియోపతి వ్యవస్థకు మూలపురుషుడైన డాక్టర్ శామ్యూల్ హానీమాన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వైద్య రంగంలో ఆయుష్ మరియు హోమియోపతి అందిస్తున్న సేవలను ఆమె కొనియాడారు. అనంతరం ఖిలా వరంగల్‌లోని ముదిరాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఆయుష్ హెల్త్ క్యాంప్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో నిపుణులైన ఆయుష్ వైద్యులు వందలాది మంది ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమా దామోదర్ యాదవ్, భోగి సువర్ణ, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సాంబశివరావు, ఆయుష్ జిల్లా ఇన్‌చార్జ్ ఎం.రాజు, నేచురోపతి మెడికల్ ఆఫీసర్ డా.అమృత వల్లి, వైద్యులు డా.రాజేందర్, డా.రాము, డా.శ్రీలత తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఆడంబరాలకు స్వస్తి.. పాఠశాల అభివృద్ధికి శ్రీకారం

### గంట రవికుమార్ ఆదర్శప్రాయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పుట్టినరోజులు అంటే ఆడంబరాలు, ఆర్భాటాలు, ఫ్లెక్సీల హోరుకు పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే కార్యకలాపాలు చేపట్టాలని వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు, సత్యం గ్రూప్స్ ఫౌండర్ గంట రవికుమార్ నిరూపించారు. తన 45వ పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం ఆయన శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. సదరు పాఠశాలలో విద్యార్థులకు సరైన మూత్రశాలల వసతి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన రవికుమార్, తన సొంత ఖర్చుతో నూతనంగా మూత్రశాలల నిర్మాణాన్ని ప్రారంభించారు. వీటితో పాటు పాఠశాల భవనంలో ఫ్లోరింగ్ పనులను కూడా చేపట్టి విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు పూనుకున్నారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాల పేరుతో అనవసరపు ఖర్చులు చేయడం కంటే, అవే నిధులతో విద్యా, వైద్య రంగాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తే ఎంతో మందికి మేలు జరుగుతుందని అన్నారు. సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా దృక్పథంతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ స్వామి, గంట రవికుమార్ ఫౌండేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వినూత్నంగా పుట్టినరోజు జరుపుకుంటూ పాఠశాల సమస్యలను తీరుస్తున్న రవికుమార్‌ను స్థానికులు ఘనంగా అభినందించారు.

# సెల్ టవర్ బ్యాటరీల దొంగల ముఠా అరెస్ట్

- ఐదుగురు నిందితుల అరెస్ట్.. ఇద్దరు పరారీ
- రూ.1.98 లక్షల విలువైన 144 బ్యాటరీలు, నగదు స్వాధీనం
- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడి

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** నిర్జన ప్రదేశాల్లోని సెల్ టవర్లను లక్ష్యంగా చేసుకుని బ్యాటరీల చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాకు చెందిన ఐదుగురు సభ్యులను పట్టుకోగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి రూ.1.98 లక్షల విలువైన 144 బ్యాటరీలు, రూ.2.60 లక్షల నగదు, రెండు ట్రాలీలు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు



స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన కొంపల్లి గణేష్ (ప్రధాన నిందితుడు), సుధాకర్, శివాజీ, నరసింహ, సురేష్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఇందులో సుధాకర్, శివాజీలకు సెల్ టవర్ మెకానిజం, జనరేటర్ రిపేర్లపై పూర్తి అవగాహన ఉంది. టవర్లలోని కొన్ని బ్యాటరీలు తొలగించినా టవర్ పనిచేస్తుందనే విషయాన్ని గుర్తించిన వీరు, గుట్టుచప్పుడు కాకుండా బ్యాటరీలను దొంగిలించేవారు. దొంగిలించిన బ్యాటరీలను మహారాష్ట్రలోని గడ్చిరోలిలో విక్రయించి, వచ్చిన డబ్బుతో నిందితులు జల్సాలు చేసేవారు. రాత్రి సమయాల్లో చెరువుల్లో చేపలు దొంగిలించే మరో గ్యాంగ్‌తో వీరికి పరిచయం ఏర్పడటంతో, చేపల వేట సాకుతో సెల్ టవర్లను రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడేవారు. ఇలా వరంగల్ కమిషనరేట్, యాదాద్రి, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో మొత్తం 13 చోరీలకు వీరు పాల్పడ్డారు. గత నెల 3న హసన్‌పర్తి



మండలం అనంతసాగర్‌లోని సెల్ టవర్‌లో 48 బ్యాటరీలు మాయమవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. టెక్నాలజీ సాయంతో నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు.. శుక్రవారం తెల్లవారుజామున దేవన్నపేట శివారు ఓఆర్ఆర్ టోల్ గేట్ వద్ద నిందితులు దొంగిలించిన సొత్తును తరలిస్తుండగా మాటువేసి పట్టుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన డీసీపీ ధార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, హసన్‌పర్తి ఇన్స్‌పెక్టర్ చేరాలు, ఎస్సైలు దేవేందర్, సుజిత్ రెడ్డి, సిబ్బందిని సీపీ సన్‌ప్రీత్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com